క్లుప్తంగా

వైద్య శిబిరంలో 94 మందికి పరీక్షలు



నిడదవోలులో శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రోటరీ ఆడిటోరియంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం డెల్టా హాస్పిటల్, శ్రీ సాయిరాం డెంటల్ హాస్పిటల్, అగర్వాల్ కంటి ఆసుపత్రుల సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో 94 మందికి పరీక్షలు చేశారు. ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రొటేరియన్ ఉజ్జిన జవహర్‌లాల్ నెహ్రూ ఆర్థిక సహకారం అందించారు. మున్సిపల్ చైర్మన్, రొటేరియన్ భూపతి ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొల్లేపర రత్నకుమార్, కామిశెట్టి వెంకట సత్యనారాయణ, క్లబ్ కార్యదర్శి అనంతపల్లి కృష్ణ చైతన్య, కోశాధికారి కోటిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈగా అప్పారావు



నిడదవోలు: ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈగా ఎస్.నారాయణ అప్పారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఏపీఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ నుంచి ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఈఈ బి.వీరభద్రరావు జగ్గంపేట బదిలీపై వెళ్లారు.

ఏడీఈగా కృష్ణనాయక్ బాధ్యతల స్వీకరణ



కృష్ణనాయక్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగులు

కొవ్వూరు: విద్యుత్ శాఖ ఆపరేషన్స్ ఏడీఈగా ఎం.కృష్ణనాయక్ మంగళవారం కొవ్వూరులో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన పి.అచ్యుతాచారి అమలాపురం బదిలీ అయ్యారు. కొత్తగా ఏడీఈగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణ నాయక్‌కు నియోజకవర్గ పరిధిలోని ఏఈలు, ఇతర ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణ నాయక్ గతంలో కొవ్వూరు ఏడీఈగా మూడేళ్లకు పైగా పని చేశారు.

ఎంవీఐ గా శివప్రసాద్ బాధ్యతల స్వీకరణ



కేవీ శివప్రసాద్



లక్ష్మీ ప్రవీణ

కొవ్వూరు: స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)గా కేవీ శివప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జంగారెడ్డిగూడెం నుంచి కొవ్వూరు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ ఓడీపై పనిచేసిన బీఎస్ శ్రీనివాస నాయక్ మచిలీపట్నానికి బదిలీ అయ్యారు. అలాగే అసిస్టెంట్ ఎంవీఐగా వి.లక్ష్మీ ప్రవీణ కూడా కొవ్వూరులో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన ఎండీ జమీర్ ఏలూరు బదిలీ అయ్యారు. దీంతో ఏర్పడిన ఖాళీలో ప్రవీణ బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా విధుల్లో చేరిన ఇరువురు అధికారులనూ కార్యాలయ ఉద్యోగులు, పలువురు ట్రాన్స్‌పోర్టర్లు కలసి అభినందనలు తెలిపారు.

వెలుగు ఏపీఎంగా రామకృష్ణ



పెరవలి: వెలుగు మండల ఏపీఎంగా నియమితులైన బండారు రామకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ మండలంలో పనిచేసిన నాగరాజు పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడుకు బదిలీపై వెళ్లారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

చాగల్లు: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ వైద్యురాలు కె.నిషిత అన్నారు. ఆ పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులకు మంగళవారం ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిషిత మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతి నెలా పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణుల ఆరోగ్య వివరాలు నమోదు చేస్తున్నామని చెప్పారు. అనంతరం గర్భిణులకు డాక్టర్ నిషిత వైద్య పరీక్షలు చేశారు.

సాగును లాభసాటి చేసేందుకే..

- డివిజన్ వ్యాప్తంగా 'పొలం పిలుస్తోంది'
- పచ్చని చేలల్లో రైతులతో అధికారులు, శాస్త్రవేత్తల మమేకం

కొవ్వూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగ పరుచుకోవాలని, ఏవైనా సందేహాలు వ్యవసాయ శాఖ అధికారుల వద్ద నివృత్తి చేసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభమైంది. మండలంలోని వేములూరు గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను ప్రభుత్వం త్వరలో రాయితీపై అందిస్తుందన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారాలు ప్రతి మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పొలంబడి నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మజ్జి శేఖర్,అక్కిన రాంబాబు, జిల్లా ఉద్యాన అధికారి బి.సుజాత, రైతులు పాల్గొన్నారు.

నల్లజర్ల: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, రైతులకు నూతన సాంకేతిక పద్ధతులు, చీడపీడల నివారణ, ప్రకృతి వ్యవసాయ విధానాల గురించి తెలియజెప్పేందుకే ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని



నల్లజర్ల మండలం అనంతపల్లి పొలం పిలుస్తోందిలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, అధికారులు, రైతులు

గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రావు అన్నారు. నియోజకవర్గ స్థాయిలో అనంతపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు తాను సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో త్రీఎఫ్ ఆయిల్‌పామ్ సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం, ఏపీ ఎంఐపీ, క్యాడ్‌బరీ, వ్యవసాయ, ఉద్యానశాఖలు తమ సంస్థలు అందించే సేవలను స్టాల్స్ రూపంలో ఏర్పాటు చేశాయి. ఉద్యాన యూనివర్సిటీ నుంచి డాక్టర్ సతీష్‌కుమార్, కేవీకే నుంచి డాక్టర్ రాఘవేంద్ర, నాలుగు మండలాల వ్యవసాయాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. డ్రోన్ సహాయంతో పురుగు మందుల పిచికారీ విధానాన్ని రైతులకు ప్రాక్టికల్‌గా వివరించారు.

ఉండ్రాజవరం: మండల వ్యవసాయాధికారి మీసాల విశ్వాసరావు ఆధ్వర్యంలో వెలగదుద్రు గ్రామంలో



తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలో పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో కలసి రైతులకు మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ధ్యేయమన్నారు. ఈకార్యక్రమంలో గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం, ప్రక్కిలంక గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామాల రైతులకు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం, విస్తరణ సేవలపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో రుచిత ఖరీఫ్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించే సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సలహా ఇచ్చారు. కార్యక్రమాల్లో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, వెటర్నరీ వైద్యాధికారి బాలాజీ శంకర్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని భీమోలు, వేళ్లచింతల



గోపాలపురం మండలం భీమోలులో..

గూడెం గ్రామాల్లో ఏవో బి.రాజారావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగు సమస్యలను గుర్తించి వాటికి అక్కడికక్కడే పరిష్కారం చూపేలా వ్యవసాయ, వాటి అనుబంధ శాఖలు పని చేస్తాయని ఏఓ సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి దరీన్‌బాబు, ఏఎంసీ సూపర్‌వైజర్ కె.కొండలరావు, ప్రకృతి వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించి పంటల ఉత్పత్తి పెంచేందుకు కృషి చేస్తున్నామని ఏవో జి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని పందలపర్రు, పెండ్యాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసారం, సూక్ష్మ పోషకాలు యాజమాన్యం, నీటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై రైతులంతా అవగాహన కలిగి ఉండాలన్నారు. అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వానికే అమ్మేలా చూడండి

- జాయింట్ కలెక్టర్ చినరాముడు
- రెండు గ్రామాల్లో పర్యటన

ఉండ్రాజవరం: రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బందికి సూచించారు. మండలంలోని ఉండ్రాజవరం, సూర్యారావుపాలెం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. తొలుత ఉండ్రాజవరం రైతు సేవా కేంద్రాన్ని, సచివాలయం-2, సొసైటీని జాయింట్ కలెక్టర్ సందర్శించారు. అలాగే గ్రామంలో జరుగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని కూడా ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన సూర్యారావుపాలెం వెళ్లి బాణసంచా అమ్మకాల లైసెన్స్ రెన్యువల్ కోసం దరఖాస్తు చేసిన మందుగుండు సామగ్రి దుకాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతులు ధాన్యం అమ్ముకునేటపుడు వారికి గోనె సంచుల సరాఫరాలో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఏవో విశ్వాసరావు, వివిధ శాఖల అధికారులు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉండ్రాజవరం రైతు సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

ఘనంగా తలారి పుట్టినరోజు వేడుకలు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పుట్టినరోజు వేడుకలు మంగళవారం పట్టణంలోని ఆ పార్టీ నూతన కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఇతర నాయకుల సమక్షంలో తలారి కేక్ కట్ చేశారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, దేవరపల్లి, గోపాలపురం, తాళ్లపూడి, చాగల్లు ఎంపీపీలు కుప్పాల దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, జొన్నకూటి పోసిరాజు, మట్టా వీరాస్వామి, కొవ్వూరు, నిడదవోలు జెడ్పీటీసీ సభ్యులు బొంతా వెంకటలక్ష్మి, కొయ్యే సూరిబాబు, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు తదితరులు హాజరై తలారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి. చిత్రంలో చెల్లుబోయిన వేణు, జక్కంపూడి రాజా

చదువులోనే కాదు ఆటల్లోనూ ఎదగాలి



వాదాలకుంటలో పోటీలను ప్రారంభిస్తున్న గోపాలపురం జెడ్పీటీసీ కాకులపాటి లలిత, ఎంపీపీ సత్యనారాయణ

- జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత
- నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలు

గోపాలపురం: యువత విద్యతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గోపాలపురం నియోజకవర్గ స్థాయి సెపక్ తక్రా ఎంపిక పోటీలు మంగళవారం మండలంలోని వాదాలకుంట జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. ప్రతిభ కనబరిచి, ఈ పోటీల్లో ఎంపికైన అండర్ -14, అండర్ -17, క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని ఫెడరేషన్ కమిటీ చైర్మన్ జె. శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, సర్పంచ్ జొన్నకూటి మణెమ్మ, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



నిడదవోలులో పరుగు పందేనికి సిద్ధమవుతున్న బాలికలు

నిడదవోలులో..

నిడదవోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు రెండో రోజు మంగళవారం కూడా కొనసాగాయి. రెండో రోజు ఎంపిక పోటీలను మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రారంభించారు. ఈ పోటీల్లో నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాలకు చెందిన సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ -14, 17 బాలబాలికల విభాగాల్లో అథ్లెటిక్స్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగాయి. అనంతరం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్కూల్ గేమ్స్ కో-ఆర్డినేటర్ ఎస్. నరసింహులు, హెచ్‌ఎం గురునాథం, ఎంఈవోలు పి.గురుమూర్తి, కేఎస్‌వీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రూ.7.14 కోట్లతో మండలం అభివృద్ధి

- దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు
- మండల పరిషత్ పాలకవర్గ మూడేళ్ల సంబరాలు

దేవరపల్లి: మండలంలోని 15 పంచాయతీల్లో గత మూడేళ్లలో రూ.7.14 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసినట్టు ఎంపీపీ కేవీకే దుర్గారావు తెలిపారు. మండల పరిషత్ పాలకవర్గ మూడేళ్ల పదవీకాలం పూర్తయిన సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ దుర్గారావు కేక్ కట్ చేశారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు ఎంపీపీ దుర్గారావు, పాలకవర్గ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ ఈ మూడేళ్లలో మండలంలో సిమెంట్, గ్రావెల్, పుంత రోడ్లు, డ్రైనేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల భవనాల మరమ్మతులు పూర్తి చేశామన్నారు. అలాగే రక్షిత మంచినీటి పథకాలు, మంచినీటి బోర్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణం వంటివి కూడా పనులు పూర్తి చేసినట్టు వివరించారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మాజీ మంత్రి తానేటి వనిత, ఎంపీటీసీ సభ్యులు, అధికారుల సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, ఏఎంసీ మాజీ చైర్మన్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, కదలి హైమావతి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటున్న ఎంపీపీ దుర్గారావు, పాలకవర్గ సభ్యులు

పాఠశాల పచ్చగా ఉండాలని..

రూ.25 వేల విలువైన మొక్కలు విరాళంగా అందించిన పూర్వ విద్యార్థి

ఉండ్రాజవరం: మండలంలోని సత్యవాడ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి పీవీ సుబ్బరాజు రూ.25 వేల విలువైన వివిధ రకాల మొక్కలను అందజేశారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల హెచ్‌ఎం బి.సూర్యకాంతం మంగళవారం తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయుడు ఎన్‌వీ కృష్ణంరాజు ప్రోత్సాహంతో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న సుబ్బరాజు తమ పాఠశాలకు మొక్కలు అందించినట్టు ఆమె వివరించారు.బత్తాయి, నారింజ, దానిమ్మ, స్టార్ ఫ్రూట్స్, గులాబీ, మందార వంటి పలు రకాల మొక్కలను మంగళవారం పాఠశాల ఆవరణలో నాటినట్టు తెలిపారు.



సత్యవాడ ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న హెచ్‌ఎం సూర్యకాంతం, ఉపాధ్యాయులు

రఘురామను సస్పెండ్ చేయాలంటూ దీక్ష

నల్లజర్ల: ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మంగళవారం మండలంలోని ఘంటావారిగూడెంలో ఒక రోజు నిరాహార దీక్ష చేసింది. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుపాడులో బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపి రాజ్యాంగ నిర్మాతను అవమానించిన రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రఘురామకృష్ణంరాజు కుల మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళనకారులు మండి పడ్డారు. అలాగే కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల ఫోర్సెనిక్ మెడిసిన్ విభాగాధిపతి, దళితుడైన ఉమామహేశ్వరావుపై దాడి చేసిన కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆయన అనుచరులపై చర్యలు తీసుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తోందని వారంతా ప్రశ్నించారు. ఈ దీక్షలో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కోర్ కమిటీ సభ్యులు పిల్లి కాంతారావు, గుదే వెంకట సుబ్బారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దొబ్బిడి శ్రీను, దొబ్బిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఘంటావారిగూడెంలో నిరాహార దీక్ష చేస్తున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

నిడదవోలు: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల్లో దళిత వైద్యుడు ఉమామహేశ్వరరావును బెదిరించిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని, అంబేడ్కర్ ఫ్లెక్సీ చింపి ప్రజల్లో కుల,మత ఘర్షణలు రెచ్చగొట్టేలా మాట్లాడిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కేఎన్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్ర బాబు డిమాండ్ చేశారు.

అన్నదాతల ఆదాయం పెంచడమే లక్ష్యం

- రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్
- కాకరపర్రులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ప్రారంభం

పెరవలి: సాగు పెట్టుబడులు తగ్గించి, పంట దిగుబడులు పెంచి రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండలంలోని కాకరపర్రు గ్రామంలో మంగళవారం మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ డ్రోన్ సాయంతో పంటలకు పురుగు మందులను పిచికారీ చేస్తే సమయం, సొమ్ము ఆదా అవుతుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ జిల్లాలోని 18 మండలాల్లో 367 గ్రామాలు ఉన్నాయన్నారు. మండలంలో వారానికి నాలుగు గ్రామాల చొప్పన జిల్లాలోని 72 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.



కాకరపర్రులో పొలం పిలుస్తోంది పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి దుర్గేష్

ఈ సభల్లో వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానశాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారని చెప్పారు. ఈ సభల్లో రైతులకు సలహాలు అందివ్వడంతో పాటు పంటలకు సోకే తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వారు వివరిస్తారన్నారు. కార్యక్రమంలో పొలం పిలుస్తోంది పోస్టర్‌ను మంత్రి ఇతర నాయకులు ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు అధికారి బి.తాతారావు, జిల్లా,డివిజన్ హార్టికల్చర్ అధికారులు సత్యకుమారి, సీహెచ్ శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ అధికారి ఎస్ సునీల్, శాస్త్రవేత్త సీహెచ్ నరసింహారావు, కొవ్వూరు అరటి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త కె.రవీంద్ర, కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్, తహసీల్దార్ అచ్యుతకుమారి, ఎంపీడీఓ రమేష్, సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం..

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని కాకరపర్రు గ్రామంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి దుర్గేష్ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఈ వంద రోజుల్లో ప్రజలకు చేసిన మేలును వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేసేదీ ఆయన చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, జిల్లా హార్టికల్చర్ అధికారి సత్యకుమారి, ఇతర అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన 21 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

కొవ్వూరు: పశివేదల గ్రామంలోని రెండు ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 21 గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మంగళవారం తెలిపారు. లక్ష్మీ గణపతి గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న గారపాటి దుర్గబాబు 14 గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయకుండా అక్రమంగా నిల్వ ఉంచారన్నారు. అలాగే వీవీఎస్ షుగర్స్ ఎక్స్ లిమిటెడ్‌లో పార్ట్ టైమ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న గారపాటి వెంకట్రావు మరో ఏడు సిలిండర్లు నిల్వ ఉంచాడు. మొత్తం 21 సిలిండర్లనూ స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించామన్నారు. నిందితులు ఇద్దరిపైనా కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, కిషోర్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలు ప్రారంభం

కొవ్వూరు: బోట్స్‌మెన్ సొసైటీ ఆధ్వర్యంలో నడిచే గోదావరి ఇసుక ర్యాంపుల్లో మంగళవారం ఇసుక తవ్వకాలు ప్రారంభం అయ్యాయి. కొవ్వూరు మండలంలో ఆరు ర్యాంపులకు అనుమతి ఇవ్వగా కేవలం మూడు ర్యాంపుల్లో మాత్రమే పాక్షికంగా ఇసుక దించారు. వాడపల్లి ర్యాంపులో సుమారు 200 పడవలు ఉంటే కేవలం పది లోపు పడవలు మాత్రమే తిరిగాయి. ఔరంగాబాద్ ఇసుక ర్యాంపులోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ ఆరు పడవలు మాత్రమే నడిచాయి. దండగుండ రేవులో ఒకే పడవ నడిచింది. ఇక ఎరినమ్మ, కొవ్వూరు, ఔరంగాబాద్-2 ఇసుక ర్యాంపులు మంగళవారం కూడా తెరుచుకోనే లేదు. జూన్ 1వ తేదీ నుంచి బోట్స్‌మెన్ సొసైటీల్లో ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. నాలుగు నెలలు పూర్తి కావస్తున్న తరుణంలో ఎట్టకేలకు మంగళవారం ర్యాంపుల్లో మళ్లీ ఇసుక తవ్వకాలు ప్రారంభించారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

నల్లజర్ల: మండలంలోని ఘంటావారిగూడెం శివార్లలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.18,710 స్వాధీనం చేసుకున్నట్టు నల్లజర్ల ఎస్‌ఐ హరిబాబు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొవ్వూరు: కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన చెరుకు పోసియ్య (40) అనే వ్యక్తి మంగళవారం మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. పోసియ్య ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం మోటార్ సైకిల్‌పై వెళుతున్నాడు. చిడిపి సమీపంలో గేదెలు అడ్డు రావడంతో ప్రమాదవశాత్తూ అతడు కింద పడిపోయారు. అతడి తలకు బలమైన గాయం అయ్యింది. దీంతో పోసియ్యను తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

మృతుడి ఆచూకీ లభ్యం



శీలంశెట్టి సత్యాజీరావు (ఫైల్)

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని పిండ ప్రదానాల రేవులో ఆదివారం లభించిన వృద్ధుడి మృతదేహం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన శీలంశెట్టి సత్యాజీరావు (74)దిగా గుర్తించారు. సత్యాజీరావు ఈనెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు వెతక సాగారు. ఈనెల 23న జంగారెడ్డిగూడెం పోలీసు స్టేషన్‌లో అదృశ్యం కేసు కూడా నమోదు చేశారు. పత్రికల్లో వచ్చిన కథనం ఆధారంగా ఈ నెల 22న గోష్పాద క్షేత్రం వద్ద లభించిన మృతదేహం సత్యాజీరావుదిగా కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతదేహం ప్రస్తుతం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంది. ఆ మృతదేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు తమను సంప్రదించినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై తెలిపారు.

ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్టు

చాగల్లు: మండలంలో చిక్కాలలో ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన కేసులో నిందితుడైన అదే గ్రామానికి చెందిన పెదపాటి పండు అనే వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్టు చాగల్లు ఎస్సై కె.నరేంద్ర తెలిపారు. ఈ గ్రామానికి చెందిన సంసాని గంగరాజు అనే వ్యక్తి మనస్థాపంతో ఈ నెల 22న ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనలో నిందితుడైన పెదపాటి పండును అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.